క్లుప్తంగా

దేవాలయాల పరిరక్షణకు హైందవ శంఖారావం

పుల్లలచెరువు: విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం పుల్లలచెరువులో జరిగిన హిందూ సమ్మేళనంలో వీహెచ్‌పీ నేత గజ్జెల్లి శ్రీనువాసులు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో హిందూ దేవాలయాల పరిరక్షణకు విజయవాడలో జనవరి 5వ తేదీన హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మంది హిందువులు ఈ కార్యక్రమానికి తరలిరానున్నారని పేర్కొన్నారు. ప్రముఖ్ నాగిరెడ్డి మాట్లాడుతూ దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించాలని, నాణ్యమైన ప్రసాదాలు అందించాలని, దేవాలయాల ఆదాయం హిందూ దేవాలయాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ జిల్లా ధర్మప్రచార్ ప్రముఖ్ వెంకట్రాములు, పుల్లలచెరువు ప్రముఖులు గురునాథం, బాబు, నాగిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీ ప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా నాగరాజు


వీఆర్వోల సంఘ నూతన కమిటీ

కురిచేడు: మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా కేవీ నాగరాజును సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వీఆర్వోలందరూ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా వీఎస్ సరోజని, ప్రధాన కార్యదర్శిగా చింతల రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా వి.హనుమంతరావు, కోశాధికారిగా చింతపల్లి రమాదేవి, గౌరవ అధ్యక్షులుగా వీసీహెచ్ శేషగిరిరావు, కె.ఖాశిం, సభ్యులుగా ఐవీ రాజ్యలక్ష్మి, వి.రేణుక, ఎం.వెంకటకృష్ణలు ఎన్నికయ్యారు.

రైల్వే ప్రయాణికుల అవస్థలు

- దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి
- డీఆర్ఎం, జీఎంను కలిసినా ఫలితం శూన్యం
- రైల్వే ప్రయాణికుల ఆవేదన



దొనకొండ రైల్వేస్టేషన్

దొనకొండ:

మండల కేంద్రం దొనకొండ రైల్వేస్టేషన్‌లో రాత్రి వేళ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అమృత భారత్ కింద రూ.18 కోట్లతో స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. రైల్వేస్టేషన్‌లో రాత్రి వేళల్లో రైళ్లు ఆగక పోవడంపై ప్రయాణికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. 2019 ముందు ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు దొనకొండ స్టేషన్‌లో ఆగేది. 2019 తర్వాత కరోనా రావటం, ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెంటనే నిలిపేయడం, ఆ తర్వాత ఆర్డినరీ రైళ్లు నిలిపేశారు. ఆ సమయంలో ప్రయాణికులు నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, నంద్యాల, డోన్, గుంతకల్, బెంగళూరు, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022లో కరోనా పూర్తిగా పోయిన తర్వాత రైళ్లు పునరుద్ధరించారు. రైల్వే అధికారులు తనిఖీల కోసం వచ్చే వారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు దొనకొండలో నిలపకుండా మార్కాపురంలో నిలిపేవారు. దూర ప్రాంతాలకు వెళ్లి పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు దొనకొండలో రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిటీష్ కాలం నుంచి రైల్వేలో దొనకొండ స్టేషన్‌కు చరిత్ర ఉందని రైల్వే ఉన్నతాధికారులు చెప్పేవారు.

స్టేషన్ చరిత్ర గొప్పదే

1940 నుంచి మీటర్ గేజ్ ఇటు నంద్యాల, అటు గుంటూరుకు ఉండేది. ఆ సమయంలో 16 రైళ్లు గుంటూరు నుండి హుబ్లీ వరకు తిరిగేవి. 1990 నుంచి మీటర్ గేజ్ లైన్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో 18 ఎక్స్‌ప్రెస్, ఆర్డినరి రైళ్లు తిరిగాయి. విశాఖపట్నం నుంచి హుబ్లీ, బెంగళూరు వైపు ప్రశాంతి, కొండవీడు, గరీబ్‌రథ్, అమరావతి, సత్యసాయి నిలయం ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. అంతేకాకుండా విజయవాడ–హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు భువనేశ్వర్–బెంగళూరు, మచిలీపట్నం–యశ్వంత్‌పూర్ రైళ్లు నడిచేవి. చుట్టుపక్కల మండలాలైన దర్శి, పొదిలి, కొనకనమిట్ల, కురిచేడు, యర్రగొండపాలెం మండలాలకు చెందిన ప్రయాణికులు ఎక్కువ భాగం దొనకొండ నుంచి రైళ్లల్లో ఇతర ప్రాంతాలకు నిత్యం వెళ్లే వారు. 5 సంవత్సరాల నుంచి దొనకొండ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపక పోవడంతో ప్రయాణికుల అగచాట్లు చెప్పేవి కాదు. ఎన్నోసార్లు దొనకొండ పర్యటనకు వచ్చిన డీఆర్ఎం రామకృష్ణకు ఈ ప్రాంత ప్రజలు, రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. 1925 సంవత్సరంలో దొనకొండలో లోకో షెడ్ ఉండటంతో సుమారు 1000 మంది రైల్వే కార్మికులు పని చేసేవారు. 70 స్టీమ్ ఇంజన్లను నడిపేవారు. దొనకొండలో రైల్వే హాస్పటల్ ఉండటంతో గిద్దలూరు, నరసరావుపేట నుంచి రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హాస్పటల్‌కు వచ్చేవారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో దొనకొండ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరుతున్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బంది:



రైల్వే పనిపై విజయవాడ, విశాఖపట్నం వెళ్లి రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తిరిగి దొనకొండ రావాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. దొనకొండలో రైళ్లు ఆగకపోవటం, మార్కాపురం వెళ్లి తిరిగి దొనకొండ రావాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ప్రతి నిత్యం పింఛనర్స్ నంద్యాల, గుంటూరు వెళ్తుంటారు. రైల్వే ఉన్నతాధికారులు రాత్రి వేళల్లో దొనకొండలో రైళ్లు నిలపాలి.

బుక్కారపు జాన్‌రాజ్, విశ్రాంత రైల్వే ఉద్యోగుల సంఘ నేత

రైళ్లను వెంటనే పునరుద్ధరించాలి:



ఇతర పనుల మీద వారానికి రెండు సార్లు గుంటూరు, విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. కరోనా సమయంలో ఆపిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలి. చాలా మంది వ్యాపారం కోసం, హాస్పటల్ కోసం విజయవాడ వెళ్తుంటారు. మరీ ముఖ్యంగా విద్యార్థులు విజయవాడ నుంచి సెలవులకు దొనకొండ రావాలంటే ఇబ్బందిగా ఉంటోంది.

మల్లెల రామిరెడ్డి, విశ్వభారతి కరస్పాండెంట్, దొనకొండ

భావితరాలకు విద్యార్థులు వారసులు

- విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి
- ఐసీడీఎస్ పీడీ మాధురి


దొనకొండలో కుర్చీలాట ఆడుతున్న తల్లులు


పుల్లలచెరువు: కేజీబీవీలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు


తాళ్లూరు: బొద్దుకూరపాడులో భరతనాట్యం చేసిన బాలికలతో ఉపాధ్యాయులు

తాళ్లూరు: ఎవరైతే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తారో వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ పీడీ మాధురి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని తూర్పుగంగవరం, లక్కవరం, నాగబొట్లపాలెం పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, పురుషులకు ఇతర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బొద్దుకూరపాడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.సుబ్బారావు అధ్యక్షతన విద్యార్థులు ప్రదర్శించిన భరత నాట్యం పలువురిని ఆకట్టుకుంది. సర్పంచ్ మందా శ్యాంసన్ మాట్లాడుతూ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు ముందుంటామన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ వైవీ రామిరెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య చేతులమీదుగా ఆటల పోటీలల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. కస్తూరిబా పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తహసీల్దార్ సంజీవరావు, ఎంఈఓ సుబ్బయ్య, సుధాకరరావు, ఎంపీడీఓ సుందరరామయ్య పాల్గొన్నారు.

పుల్లలచెరువు: విద్యార్థుల అభ్యున్నతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో జరిగిన ఆత్మీయ సమావేశాలకు తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

దొనకొండ: తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌ను జాగ్రత్తగా తీర్చుదిద్దుకోవాలని తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ తెలుసుకునేందుకు నెలకు ఒకసారి పాఠశాలకు వచ్చి బోధించే ఉపాధ్యాయులతో మాట్లాడి పిల్లల ప్రోగ్రెస్ తదితర విషయాలు తెలుసుకోవాలన్నారు. అనంతరం సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ ఎం.శ్రీదేవి, ఎంఈఓలు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి: పాఠశాలలకు తల్లిదండ్రులు తోడ్పాటు ఇవ్వాలని కొత్తపలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆ పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. తల్లిదండ్రులు పాఠశాలలో ఆర్వో ప్లాంట్ రిపేరుకు రూ.30 వేలు విరాళంగా అందజేశారు. సర్పంచ్ బట్టు రాము, ఎంపీటీసీ ఇల్లూరి సుబ్బారెడ్డిలు మాట్లాడారు. ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, కృష్ణారావు, తిరుపతిరావు, గమేనియేలు, సీతామహాలక్ష్మి, జీనత్ బేగం, వెంకటేశ్వర్లు, రంగయ్య, మెడికల్ అధికారి ప్రమీల, వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, గోవిందరెడ్డి, యోహాను పాల్గొన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాదికారి కాకర్ల రఘురామయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాలను ప్రోత్సహించ వద్దని చెప్పారు. ప్రిన్సిపాల్ అరుణ, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బ్లెస్సీ, నాగమణి, బాలకోటయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను విమర్శించి.. అవే ఎలా బిగిస్తారు?


స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సిబ్బంది

దర్శి: గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తారంటూ ఎన్నో రకాలుగా విమర్శించిన మీరు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే వాటిని ఎలా బిగిస్తారని కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పుట్లూరి కొండారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు, వ్యాపారులు స్మార్ట్ మీటర్లు బిగిస్తే అన్యాయం అయిపోతారంటూ గగ్గోలు పెట్టిన మీరు ఇప్పుడు రైతులను, వ్యాపారులను తెలిసి అన్యాయం చేస్తునట్లే కదా అని నిలదీశారు. రైతులు, వ్యాపారులకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారంటే మీరు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి మళ్లీ మాట మార్చి రూపాయి ఇరవై ఐదు పైసలు చార్జీలు పెంచిన మీ పాలన ఏ రకంగా పాలిస్తున్నారో ప్రజలకు బాగా అర్థమవుతోందన్నారు.

వృథా నీరు పారుదలకు అడ్డుకట్ట


వృథా నీటి కోసం ఏర్పాటు చేసిన పెద్ద గుంత

సాక్షి ఎఫెక్ట్..

పెద్దారవీడు: మండలంలో బద్వీడు పంచాయతీ ప్రగళ్లపాడులో తాగునీటి ట్యాంక్ చుట్టు వృథా నీరు నిల్వ లేకుండా ఉండేందుకు పంచాయతీ అధికారులు శనివారం అక్కడ గుంత తీయించారు. తాగునీటి ట్యాంక్ చుట్టూ మురుగు తొలగించి, గ్రామం వీధుల్లో మురుగు నీరు ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రగళ్లపాడులో పడకేసిన పారిశుధ్యం శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎన్నో నెలల నుంచి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకొని అధికారులు అప్రమత్తం కావడంతో స్థానికులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అవతరణ దినోత్సవం


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి అవతరణ దినోత్సవాన్ని భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పురోహితులు మణిబాబు శర్మ గణపతిపూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అష్టోత్తర శత నామావళి పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరణ చేసి మహా నైవేద్యం సమర్పించి సామూహిక హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భైరవానంద స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గంగదేవిపల్లి వాస్తవ్యులు మల్లెబోయిన శిలువనాయుడు, విజయరాణి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. అయ్యప్ప దీక్షాపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పూజారులు

కురిచేడు: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మండలంలోని దేకనకొండ శివారులో సింగరయ్య కొండ పక్కన వేంచేసి ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సంతాన సుబ్రహ్మణ్య స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, అనంతరం కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి దర్శి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.


హాజరైన భక్తులు

విద్యార్థులపై వివక్ష తగదు


ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం విద్యార్థులపై వివక్ష చూపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల గురించి ఆయన మాట్లాడారు. విద్యార్థులపై వివక్ష చూపకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని, తల్లికి వందనం హామీని నెరవేర్చకుండా ఇటువంటి సమావేశాలు ఎన్ని నిర్వహించినా ప్రయోజనం ఉండదన్నారు. భావితరాల భవిష్యత్‌కు వారధులు, రేపటి భారతవనిని ప్రగతి పథంలో నడిపించాల్సిన విద్యార్థులపై ప్రేమ, బాధ్యతతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలంటే చులకన భావన ఉండే తరుణంలో గత ప్రభుత్వ కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా విద్యావ్యవస్థపై పూర్తిగా బాధ్యత వహించారని, నాడు–నేడు కింద రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించారని, విద్యార్థులకు ఉచితంగా మంచి యూనిఫాం, బూట్లు, టై, ట్యాబ్‌లు అందించారని, డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నవసమాజ నిర్మాణానికి పునాదులు వేసిన జగనన్నను విద్యార్థి లోకం మరువదన్నారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి విధానాలను కొనసాగించడంలో విఫలమైందని, ఏ స్కూల్లో చూసినా విద్యార్థుల డ్రాపౌట్‌లు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు రోడ్డు ఎక్కుతున్నారని, డొక్కా సీతమ్మ పేరుతో అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపించి విష ఆహారం తీసుకున్న విద్యార్థులు అనేక మంది అస్వస్థతకు గురయ్యారని, ఇటువంటి సంఘటన జరిగిన ప్రాంతంలో ప్రాణాలు కూడా కోల్పోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్యే తాటిపర్తి విచారం వ్యక్తం చేశారు. విద్యాశాఖను నిర్వహిస్తున్న లోకేష్ విద్యార్థులకు జరుగుతున్న సంఘటనలను గాలికి వదిలేసి కక్ష రాజకీయాలు నడిపేందుకు రాష్ట్రాన్ని వేదికగా చేసుకొని పాలనను అస్తవ్యస్తంగా మారుస్తున్నారని విమర్శించారు. ముందుగా ఎమ్మెల్యే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని సందేశం ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూనాయక్, హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా పేరెంట్స్ సమావేశాలు


పొట్లపాడు జెడ్పీలో విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న అధికారులు

కురిచేడు: పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశాలు శనివారం ఎక్కువ పాఠశాలల్లో మొక్కుబడిగా జరిగింది. మండలంలోని పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఉర్దూ పాఠశాల, వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విజయవంతం కాగా మిగతా అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ సింగిల్ డిజిట్‌లో మాత్రమే హాజరయ్యారు. పొలం పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో ఇలాంటి సమావేశాలు ప్రజాధనాన్ని దోచుకోవటానికి తప్ప మేరేమీ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. కోట్లాది రూపాయలు పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం పేరుతో ప్రభుత్వం ఖర్చు చేసిందని, దానిలో ఎక్కువ భాగం ధనం వృథా అయిందని చూసిన వారు చర్చించుకుంటున్నారు. మండలంలో 58 పాఠశాలలుండగా కేవలం మూడు నాలుగు పాఠశాలల్లో మాత్రమే పేరెంట్స్ పదుల సంఖ్యలో వచ్చారు. మిగిలిన పాఠశాలల్లో కేవలం ఇద్దరు, ముగ్గురితో సరిపెట్టుకోగా కొన్ని పాఠశాలల్లో కేవలం ఫొటోలకు మాత్రమే గ్రామస్తులను పిలిచి మమ అనిపించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు గత ప్రభుత్వం కూడా ప్రవేశపెట్టినా ఎక్కడా హడావుడి చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిన దాఖలాలు లేవు. కేవలం విద్యార్థులకు మాత్రమే బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసింది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలను కాపీ కొడుతూ తామేదో కొత్తగా కనిపెట్టినట్లు పబ్లిసిటీ చేసుకుంటోంది. చేసేది గోరంత చెప్పేది కొండంతగా వ్యవహరిస్తోంది. దాన్ని కూడా అధికారులను సమన్వయపరచి విజయవంతం చేసుకోవటంలో పూర్తిగా విఫలమైందని మేధావులు విమర్శిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు సమావేశాలు నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యల్లో పూర్తిగా విఫలమయ్యారు. ప్రజాధనం ఉపయోగించే కార్యక్రమాలు బాధ్యతగా చేయాల్సి ఉండగా అడుగడుగునా అదికారుల్లో నిర్లక్ష్యం కనిపించింది.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

దర్శి: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో తల్లిదండ్రులతో ఆత్మీయ సమవేశంలో పాల్గొన్నారు. పోతవరం హైస్కూల్లో సీఐ రామారావు, ఎస్సై మురళీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దర్శిలో డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌లో జరుగుతున్న అవకతవకల గురించి వివరించారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి


పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: రైతులు రబీలో సాగు చేసిన ప్రీమియం చెల్లించి పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో తోకపల్లిలో పంట నమోదును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేయకుంటే ఇన్సూరెన్స్, సబ్సిడీలు రావన్నారు. రబీలో సాగు చేసిన ప్రతి ఎకరా పంట నమోదు చేయాలని వీఏఏలకు సూచించారు. తుఫాన్, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఎంతో దోహదపడుతుందని, పంట నమోదు, పంట విస్తీర్ణంలో తేడాలు ఉండకూడదన్నారు. బీమాలో అర్హులుగా ఉండాలంటే పంట నమోదు కచ్చితంగా చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.